సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
సోమవారం । 30 । జూన్ । 2025



ఏపీఎన్ఆర్టీఎస్ ఎత్తివేత!

ఉమ్మడి కడప జిల్లాలో ఆంధ్రా కువైట్‌గా ప్రసిద్ధికెక్కిన రాజంపేటలో ఏపీఎన్ఆర్టీఎస్ (ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) కార్యాలయం ఎత్తివేశారు. -8లో



ఉద్యోగాల పేరుతో మోసం

ప్రభుత్వ జూనియర్, కస్తూర్బా కళాశాలల్లో కేరీర్ కౌన్సెలింగ్ డెవలప్‌మెంట్ అధికారి పేరిట ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని రవి నిరుద్యోగులను నమ్మ బలికించాడు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.2/26.8

జిల్లాలో ఆదివారం 26.8 - 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 11.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కాల్ సెంటర్ 1100 సేవలు వినియోగించుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ప్రారంభించిన మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేసి తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డీఆర్వో కోరారు.

డిజిటల్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలోని సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ ఆదివారం జిల్లా పరిషత్ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, డీపీఓ కార్యాలయ పరిపాలనాధికారి ఖాదర్‌బాషలు హాజరై డిజిటల్ అసిస్టెంట్ల పత్రాలను పరిశీలించారు. జిల్లాలో డిజిటల్ అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఇందులో ఐదు సంవత్సరాల సర్వీసు పూర్తయిన వారు 274 మంది, రిక్వెస్ట్ బదిలీ కోసం 40మంది దరఖాస్తు చేసుకున్నారు.

నేడు సభాభవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహణ

కడప సెవెన్‌రోడ్స్: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డీఆర్వో విశ్వేశ్వర నాయుడు తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలు మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతోపాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చని తెలిపారు.

- డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రజలు 08562-244437 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

ఇటు కేసీ చూడండి!

- కేసీ కెనాల్ నీటి విడుదలలో జాప్యమేలా!
- శ్రీశైలంలో 869.8 అడుగుల నీటిమట్టం
- ఇన్‌ఫ్లో 1,35,100 క్యూసెక్కులు
- కాలువల పూడికతీత, మరమ్మతుల్లో అలసత్వం
- మట్టి అమ్ముకోవడంపై ఉన్న శ్రద్ధ నీటి విడుదలపై లేదు
- టీడీపీ నేతలపై ఆయకట్టు రైతుల ఆగ్రహం



కేసీ కెనాల్ (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్: శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం ఎండీడీఎల్‌ను మించి నీటిమట్టం ఉంది. పైనుంచి వస్తున్న వరద ప్రవాహం కూడా అధికంగానే ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే వారం, పది రోజుల్లోనే శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరుకుంటుందని నిపుణులు అంటున్నారు. జూన్ చివరి నాటికే జలాశయంలో నీటి మట్టం ఈ స్థాయికి చేరడం గత 20 ఏళ్లలో ఎన్నడూ లేదని అంటున్నారు. కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదలకు చర్యలు తీసుకుంటే సకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు వీలవుతుందని రైతులు అంటున్నారు. అయితే చెరువు మట్టి అమ్ముకోవడంలో చూపుతున్న శ్రద్ధ అధికార తెలుగుదేశం పార్టీ నేతలకు సాగునీటి విడుదలపై లేదని ఆయకట్టు రైతులు విమర్శిస్తున్నారు. వాతావరణ పరిస్థితి ఈ ఏడాది సానుకూలంగా కనిపిస్తోంది. రుతు పవనాల ప్రభావం వల్ల జిల్లాలో కాకపోయినా ఎగువ ప్రాంతాల్లో ముందుగానే వర్షాలు కురిశాయి. మే, జూన్ మాసాల్లో తుంగభద్ర డ్యాం దిగువ పరీవాహక ప్రాంతంలో సమృద్ధిగా వర్షాలు కురిశాయి. దీంతో దిగువకు భారీ వరద ప్రభావం వస్తోంది. తుంగభద్ర డ్యాం పరిస్థితిని పరిశీలిస్తే పూర్తిస్థాయి సామర్థ్యం 1633 అడుగులు. గత సంవత్సరం ఇదే రోజు డ్యాంలో 1581.56 అడుగుల నీటిమట్టం ఉండగా, ఆదివారం 1622.12 అడుగుల నీటి మట్టం ఉంది. డ్యాం గరిష్ట సామర్థ్యం 105.788 టీఎంసీలు. గత సంవత్సరం ఇదే రోజుకు 5.28 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 67.47 టీఎంసీలు ఉన్నాయి. గత ఏడాది 1819 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, నేడు 65,182 క్యూసెక్కులు ఉన్నాయి. గత ఏడాది 297 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉండగా, ఇప్పుడు 202 క్యూసెక్కులు ఉన్నాయి. ఇక కృష్ణా పరీవాహక ప్రాంతంలో అల్మట్టి డ్యాం గరిష్ట సామర్థ్యం 129.72 టీఎంసీ కాగా, ప్రస్తుతం డ్యాంలో 84.55 టీఎంసీ(65.18 శాతం)లు ఉన్నాయి. అంటే 1696.39 అడుగుల నీటిమట్టం ఉంది. ఫ్లడ్ కుషన్ 45.17 టీఎంసీలుగా నమోదైంది. ఇక ఇన్‌ఫ్లో 1,07,081 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో కూడా అంతే ఉంది. నారాయణపూర్ జలాశయం గరిష్ట సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 30.93 టీఎంసీ (82.18 శాతం)లుగా ఉంది. ఫ్లడ్ కుషన్ 6.71 టీఎంసీగా ఉంది. ఆ రిజర్వాయర్‌లో 1609.97 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. కాగా, ఇన్‌ఫ్లో 1,02,426 క్యూసెక్కులు ఉండగా, అంతేస్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులో గరిష్ట నీటిమట్టం 9.66 టీఎంసీలకుగాను 7.1 టీఎంసీ (73.47 శాతం) ఉంది. ప్రస్తుతం 1040.68 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఫ్లడ్ కుషన్ 2.56 టీఎంసీగా ఉంది. ఇక ఇన్‌ఫ్లో 1,25,630 క్యూసెక్కులు కాగా, 1,28,374 క్యూసెక్కుల ప్రవాహాన్ని కిందికి విడుదల చేస్తున్నారు.

ఆయకట్టుకు నీరివ్వండి



జిల్లాలో ప్రధాన సాగునీటి వనరు కేసీ కెనాల్. దీని కింద 92 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం ఇప్పటికే 854 అడుగుల ఎండీడీఎల్ దాటింది. గణనీయంగా వరద ప్రవాహం వచ్చి పడుతోంది. ఈ తరుణంలో పోతిరెడ్డిపాడు ద్వారా కేసీ కెనాల్‌కు సాగునీరు విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. ఆయకట్టు పరిధిలోని అధికార టీడీపీ ఎమ్మెల్యేలు ఈ దిశగా కృషి చేయాలి.

– పోతిరెడ్డి భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీ రైతు సంఘం, మైదుకూరు

కాలువ పూడికతీత పనులు చేపట్టాలి



శ్రీశైలంలో సమృద్ధిగా నీటిమట్టం ఉండడం వల్ల కేసీ కెనాల్‌కు నీరు విడుదల చేయాలంటే తొలుత కాలువల పూడికతీత పనులు, షట్టర్ల మరమ్మతులు చేపట్టాలి. సాధారణంగా మే, జూన్ నెలల్లోనే నిధులు విడుదల చేసి ఈ పనులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు నీటి విడుదలకు మార్గం సుగమం అయ్యేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించింది.

–చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, కన్వీనర్, రాయలసీమ సాగునీటి సాధన సమితి, కడప

శ్రీశైలంలో పెరుగుతున్న నీటిమట్టం

ఎగువ రాష్ట్రాల్లో మే, జూన్ నెలల్లోనే వర్షాలు బాగా కురవడంతో కృష్ణా, తుంగభద్ర ద్వారా వరద ప్రభావం శ్రీశైలం జలాశయానికి భారీగానే వస్తోంది. శ్రీశైల జలాశయ గరిష్ట నీటిమట్టం 885 అడుగులకుగాను ఆదివారం నాటికి 869.8 అడుగులకు చేరుకుంది. డ్యాం గరిష్ట సామర్థ్యం 215.8 టీఎంసీలు కాగా, ప్రస్తుత స్టోరేజీ 140.65 టీఎంసీ (65.17 శాతం)లకు చేరింది. ఫ్లడ్ కుషన్ 75.16 టీఎంసీలుగా నమోదైంది. ఇక డ్యాంలోకి 1,35,100 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. గత 20 ఏళ్ల నుంచి ఇంత సానుకూల పరిస్థితి ఎన్నడూ లేదని అంటున్నారు. ప్రభుత్వం కూడా నీటిని దిగువకు విడుదల చేయకుండా నిల్వ ఉంచడం వల్ల నీటిమట్టం పెరుగుతోంది. ఇలాగే పరిస్థితి కొనసాగితే వారం లేదా పది రోజుల్లోనే డ్యాం నీటిమట్టం పూర్తి స్థాయికి చేరుకుంటుందని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం నీటిని కేసీ కెనాల్‌కు విడుదల చేయాలని ఆయకట్టు రైతాంగం కోరుతోంది. కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో మొత్తం కేసీ కింద 2.65 లక్షల ఎకరాలు ఉంది. ఇందులో వైఎస్సార్ కడపజిల్లాలో 92 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రతి ఏడాది ఆగస్టులో సాగునీరు విడుదల చేసేవారు. ఇప్పుడు ముందుగానే శ్రీశైలంలో ఎండీడీఎల్‌కు మించి నీటి మట్టం చేరుకుంది. కాబట్టి జులై ప్రథమార్థంలోనే నీరు విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. నీటి ప్రకటన చేస్తే నారు నారుమడులు సిద్ధం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఖరీఫ్ ప్రారంభంలోనే పంటల సాగు చేపట్టడం వల్ల చీడపీడల బెడద గణనీయంగా తగ్గుతుందని, దిగుబడి బాగా ఉంటుందని రైతులు అంటున్నారు. పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నప్పటికీ అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు, సాగునీటి సంఘాల నేతలు చెరువుల్లో మట్టిని అమ్ముకోవడంపైనే శ్రద్ధ చూపుతున్నారు తప్ప కేసీ నీటి విడుదల విషయం ఆలోచించడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా నీటి విడుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వచ్చేనెల 12 నుంచి జేవీవీ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్

కడప ఎడ్యుకేషన్: కడపలో జులై 12, 13 తేదీల్లో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. జన ఈ విషయాన్ని విజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు బి. విశ్వనాథ్ తెలిపారు. ఆదివారం కడప ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేడు సమాజంలో జరుగుతున్నటువంటి మూఢనమ్మకాలకు సంబంధించి జేవీవీ పోరాడుతోందన్నారు. అలాగే ప్రజల ఆరోగ్యం, విద్యకు సంబంధించి తమ వేదిక ప్రధానంగా కృషి చేస్తోందన్నారు. జేవీవీ సమాచార కార్యదర్శి పి. సలావుల్లా మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారి ఆరోగ్యం, విద్యా కేంద్రీకృతంగా తమ సంస్థ కృషి చేస్తోందని అన్నారు. కడపలో జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా నాయకులు కె. సురేష్ బాబు, సుధాకర్, ఇలియాస్‌బాషా,వెంకటరామిరెడ్డి, శేషారెడ్డి,భాస్కర్, నాగార్జునరెడ్డి, గౌరీ శంకర్, మహబూబ్ బాషా,వెంకటశివ, వలిరాజు,భాగ్యలక్ష్మి, ఎల్లేశ్వర రావు,హైదర్ అలీ, రమణారెడ్డి,సుబ్బారెడ్డి తదితరులు సమావేశంలో పాల్గొని ప్రసంగించారు.

వీఆర్‌కు సీఐ నాగార్జున

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ సీఐగా పనిచేస్తున్న బి.నాగార్జునను కడప వీఆర్‌కు తరలిస్తూ కర్నూలు– కడప రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులను జారీ చేశారు. సీఐపై వచ్చిన పలు రకాల ఆరోపణలకు సంబంధించి విచారణ జరుగుతున్న నేపథ్యంలో వీఆర్‌కు పంపినట్లు సమాచారం. ఈ మేరకు సీఐ జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్, కర్నూలు రేంజ్ డీఐజీ వద్ద హాజరై ఉత్తర్వులను అందుకున్నారు.

గంగమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



లక్కిరెడ్డిపల్లి: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న లక్కిరెడ్డిపల్లెలోని అనంతపురం గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం గంటల కొద్దీ క్యూలైన్‌లలో వేచి ఉన్నారు. గంగమ్మా ..కరుణించమ్మా.. సకాలంలో వర్షాలు కురిపించు తల్లీ అంటూ భక్తులు అంటూ వేడుకున్నారు. జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కొందరు బోనాలు సమర్పించారు. మరికొందరు తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు

మదనపల్లె సిటీ: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడాభివృద్ధి సంస్థ అధికారి గౌస్‌బాషా అన్నారు. మదనపల్లె సమీపంలోని వేద పాఠశాలలో రాష్ట్ర స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పోటీలను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. విద్యార్థి దశ నుంచి క్రీడపట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్, రాష్ట్ర పరిశీలకులు సిరాజ్‌అహ్మద్, చినబాబు,కమలేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు. మొదటి రోజు అన్నమయ్య, తిరుపతి, సత్యసాయి, వైజాగ్ జిల్లాల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి.

నిబంధనలు గాలికి..



సరైన వసతులు లేకపోవడంతో నేలపై కూర్చున్న ఉద్యోగులు



కుర్చీలు లేకపోవడంతో చంటిబిడ్డతో నిలుచున్న ఓ తండ్రి

- రెండోరోజు మెడికల్ గ్రౌండ్, స్పౌజ్ కేసులకు అన్యాయం
- అధికారి పార్టీ నేతల సిఫార్సులకే పెద్దపీట
- అన్యాయం జరిగిందని ఆందోళన

కడప అగ్రికల్చర్: కడప కలెక్టరేట్ ఆవరణలోని ఉద్యాన, వ్యవసాయశాఖ కార్యాలయంలో రెండోరోజు ఉమ్మడి కడపజిల్లా సచివాలయ ఉద్యాన, వ్యవసాయ సహాయకులు బదిలీ కౌన్సెలింగ్ కొనసాగింది. రెండోరోజు కూడా అధికారులు ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కారు. ఎమ్మెల్యేల సిఫార్సులకే ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిసింది. కూటమి నేతలు ఇచ్చిన లెటర్లతోపాటు వారి ఫోన్లకే ప్రాధాన్యత కల్పించినట్లు పలువురు ఉద్యోగులు ఆరోపించారు. కూటమి నేతలు చెప్పిన వాళ్లకే మంచి స్థానాలను కేటాయించారని చర్చించుకున్నారు. వ్యవసాయ సహాయకులకు సంబంధించి 269 మందికిగాను మొదటి రోజు 175 మందికి కౌన్సెలింగ్‌ను పూర్తి చేశారు. మిగతా 94 మందికి ఆదివారం నిర్వహించారు. ఇందులో కూడా స్పౌజ్, మెడికల్ కేసులను ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదని వాపోయారు. ప్రభుత్వ నిబంధనలను కూడా పరిగణలోకి తీసుకోకుండా తమకు అన్యాయం చేశారని పలువురు బాధితులు ఆవేదనను వ్యక్తం చేశారు. ఒక డిజేబుల్ అమ్మాయిని లక్కిరెడ్డిపల్లె నుంచి రాజుపాలెం మండలానికి బదిలీ చేసినట్లు, మరో మెడికల్ గ్రౌండ్ ఉన్న అబ్బాయిని పెద్దముడియం నుంచి వీఎన్‌పల్లెకు బదిలీ చేసినట్లు తెలిసింది. ఈ విషయంలో తమకు అన్యాయం జరిగిందని మొరపెట్టుకున్నా అధికారులు పెడచెవిన పెట్టారని తెలిసింది. అలా ఒకరిద్దరికి కాకుండా చాలా మందికి అన్యాయం జరిగినట్లు తెలిసింది. కౌన్సెలింగ్‌కు వచ్చిన అభ్యర్థులను ర్యాంకుల వారీగా పిలిపించి వారికి వచ్చిన స్థానాలను కేటాయించారు. అయితే ఈ స్థానాలను తరువాత ఇచ్చే అర్డర్‌లో కనపరుస్తారా లేక అధికార పార్టీ నేతలు చెప్పిన వాళ్లకు కట్టుబెడతారా అనే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం బదిలీల్లో అన్యాయం జరిగిన వ్యవసాయ సహాయకులంతా ధర్నాకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. రెండవ రోజు కూడా సరైన వసతులు లేక వ్యవసాయ సహాయకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్, అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి శ్రీమన్నారాయణ, డీఏఓ కార్యాలయ ఏడీ మాధవి, ఏవో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉద్యానశాఖ సహాయకులకు సంబంధించి 177 మందికి మొదటి రోజు, మిగిలిపోయిన వారికి రెండోరోజు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, ఏపీఎంఐపీ పీడీ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఉద్యాన, వ్యవసాయ సహాయలకు బదిలీలకు సంబంధించి డీఏఓ చంద్రనాయక్ డీహెచ్ఓ రవిచంద్రబాబులు మాట్లాడుతూ రెండో రోజు బదిలీల కౌన్సిలింగ్‌ను కూడా సిఫారస్సులకు తావు లేకుండా పారదర్శకంగానే నిర్వహించామని తెలిపారు.

- రైతు సేవా కేంద్రాలకు వచ్చిన ఎరువులను విక్రయించగా వచ్చిన డబ్బులను ప్రభుత్వానికి చెల్లించకుండా గతంలో కొందరు వ్యవసాయ సహాయకులు సొంతానికి వాడుకున్నారు. ప్రస్తుత బదిలీల్లో డబ్బులు వాడుకున్న వారికి ఈ వ్యవహారం గుదిబండగా మారింది. బకాయి డబ్బులను చెల్లిస్తేనే బదిలీకి అనుమతి ఇస్తామని, లేకుంటే లేదని ముందుస్తుగానే అధికారులు వారికి సూచించినట్లు తెలిసింది. దీంతో బకాయిలు ఉన్న కొంతమంది డబ్బులు చెల్లించగా అధిక మొత్తంలో బకాయిలు ఉన్న వారు మాత్రం చెల్లించలేకపోయినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో అధికారులు వారితో ఒప్పందం తీసుకుని బదిలీల్లో చోటు కల్పించినట్లు సమాచారం.



కౌన్సెలింగ్ కేంద్రం వద్ద గుమికూడిన ఉద్యోగులు

గ్రామీణ విద్యార్థులకు బంగారు భవిత

నేటి నుంచి ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో కౌన్సెలింగ్

వేంపల్లె: గ్రామీణ పేదవర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి ఇంజినీరింగ్ విద్యను అందించేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచనలకు రూపమే ట్రిపుల్ ఐటీలు. వీటిని ఆర్జీయూకేటీ నిర్వహిస్తోంది. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో 2025– 26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. తెలిపారు. ఉదయం 9 గంటలకు క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలో కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఈనెల 23న రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీలు నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలకు సంబంధించి అధికారులు ఎంపిక జాబితా విడుదల చేశారు. ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి సంబంధించి ఈనెల 30 వ తేదీ, జులై 1వ తేదీలలో ఎంపికైన విద్యార్థులకు కౌన్సెలింగ్ పక్రియ ఉంటుంది. ఈ పక్రియకు కావలసిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేసినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమార స్వామిగుప్తా తెలిపారు.



ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ముఖ ద్వారం

రెండు రోజుల్లో 1,060 మందికి కౌన్సెలింగ్

ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో భాగంగా రెండు రోజుల్లో ప్రత్యేక కేటగిరీ మినహా 1060మందికి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 30వ తేదీ (సోమవారం) 530 మంది అభ్యర్థులకు, జూలై 1వ తేదీన 530 మంది అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం రాష్ట్రంలోని నలుమూలల నుంచి సీట్లు వచ్చిన అభ్యర్థులు పాల్గొననున్నారు. అభ్యర్థులందరికీ ఇప్పటికే ట్రిపుల్ ఐటీ అధికారులు కాల్ లెటర్లు, వారి మొబైల్స్‌కు సందేశాలు పంపించారు.

కౌన్సెలింగ్‌కు అవసరమైనవి

పదోతరగతి హాల్ టికెట్, పదోతరగతి మార్కుల జాబితా, 10వ తరగతి టీసీ, కాండక్ట్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ (4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు), మీసేవా కేంద్రం నుంచి తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత మీసేవా కేంద్రం ద్వారా తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, అభ్యర్థి, అతని తల్లిదండ్రుల రెండు పాసు పోర్టు ఫొటోలు, రేషన్ కార్డు, అభ్యర్థి ఆధార్ కార్డు, విద్యార్థులకు ఎవరికైనా బ్యాంకు లోన్ అవసరమైతే పైన పేర్కొన్న సర్టిఫికెట్లన్నీ నాలుగు సెట్లు, అభ్యర్థి తండ్రి ఉద్యోగి అయితే ఎంప్లాయి ఐడెంటీ కార్డు, శాలరీ సర్టిఫికెట్, అభ్యర్థి తండ్రి పాన్, ఆధార్, ఓటర్ ఐడీ కార్డు అందజేయాలి.

విద్యార్థులు ఎలా రావాలంటే ..

అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు తదితర జిల్లాల వైపు నుంచి వచ్చేవారు వేంపల్లె బస్టాండుకు చేరుకున్న తర్వాత అక్కడి నుండి ప్రతి నిమిషానికి ఇడుపులపాయకు ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి ప్రత్యేక బస్సులు ఉన్నాయి. వేంపల్లె నుంచి ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి 15 కిలోమీటర్లు దూరం మాత్రమే ఉంది. అంతేకాకుండా వేంపల్లె బస్టాండు, నాలుగు రోడ్ల కూడలిలో దిగిన తర్వాత అక్కడనుండి వీరన్నగట్టుపల్లి మీదుగా ట్రిపుల్ ఐటీకి నిత్యం ఆటోలు ఉంటాయి.

కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఆర్కే వ్యాలీ ట్రిపుల్ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలో 530 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అందుకు సంబంధించి కొత్తగా వచ్చిన విద్యార్థులకు భోజనం వసతి, మౌలిక వసతులు తదితర ఏర్పాట్లు చేశారు. ముందుగా ట్రిపుల్ ఐటీ ముఖ ద్వారం వద్ద విద్యార్థులు టోకెన్ తీసుకుని సెంట్రల్ లైబ్రరీలో దరఖాస్తు పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ఉంటుంది. అనంతరం పదవ తరగతిలో పాసైన ఒరిజినల్ సర్టిఫికెట్లు, టీసీ, విద్యార్థి ఫోటోలు, తల్లిదండ్రుల ఫోటోలు తదితర వాటిని పొందుపరిచి అడ్మిషన్ పూర్తి చేస్తారు. జూలై 15 తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

విద్యాభ్యాసం గురించి

'అన్ని సబ్జెక్టులకు ప్రతినెల పరీక్షలు ఉంటాయి. ప్రతి సెమిస్టర్ 24 వారాలు ఉంటుంది. వేసవి సెలవులు 3 వారాలు మాత్రమే ఉంటాయి. జూలై 15వ తేదీ తరగతులు ప్రారంభమై నవంబరు 30 వరకు జరుగుతాయి. అనంతరం సెమిస్టర్ పరీక్షలు ఉంటాయి. పీయూసీలో ఆరు సబ్జెక్టులుంటాయి. ఆంగ్లం (రెండు పేపర్లు), గణితం (రెండు పేపర్లు), భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, తెలుగు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులుంటాయి.

క్రమశిక్షణ..ఉత్తమ విద్యాబోధన

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ విద్యా బోధనలో భాగంగా ఆహ్లాదకరమైన వాతావరణం, నాణ్యమైన విద్యాబోధన, క్రమశిక్షణ, ఉత్తమ సామాజిక స్పృహ ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ సొంతం. ఉదయం 7గంటలకు అల్పాహారం, అనంతరం అసెంబ్లీ, 8 గంటల నుంచి 12 గంటల వరకు తరగతులు, ఒంటిగంట వరకు భోజన విరామం, మళ్లీ ఒంటిగంట నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు తరగతులు, అనంతరం టీ, స్నాక్స్, 6గంటల వరకు ఆటలు, రాత్రి 7గంటలకు భోజనం, అనంతరం రాత్రి 10 గంటల వరకు స్టడీ అవర్స్ ఇవి ట్రిపుల్ ఐటీ విద్యార్థుల దైనందిన కార్యక్రమాలు. మొదటి రెండు సంవత్సరాలు ఇంటర్‌కు సమానమైన పీయూసీ కోర్సును, తర్వాత నాలుగేళ్లు ఇంజినీరింగ్ విద్యను బోధిస్తారు. 'ట్రిపుల్ ఐటీలో చేరిన తర్వాత విద్యార్థులు మొదటి, రెండు సంవత్సరాలు (పీయూసీ) ఏడాదికి రూ.45 వేలు, తర్వాత నాలుగేళ్లు (ఇంజనీరింగ్) ఏడాదికి రూ.50వేల చొప్పున చెల్లించాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హత కలిగిన విద్యార్థులకు ప్రభుత్వమే చెల్లిస్తుంది. ప్రభుత్వం చెల్లించిన నగదుపోను మిగిలిన సొమ్మును విద్యార్థులే చెల్లించాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

పిచ్చికుక్క స్వైర విహారం



పిచ్చికుక్క దాడిలో గాయపడిన మోహన్ కళ్యాణ్

బద్వేలు అర్బన్ : పట్టణంలో అబ్బరాతివీధిలో ఆదివారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఈ ఘటనలో ఓ బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. అబ్బరాతివీధికి చెందిన మోహన్ కళ్యాణ్ ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా మీద పడి దాడి చేసింది. తీవ్ర గాయం కావడంతో తల్లిదండ్రులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించారు. అలాగే పట్టణంలోని కోటవీధిలో కృతిక్ అనే బాలుడు, పప్పుల వీధిలో సన్విస్ అనే బాలిక పిచ్చికుక్క దాడిలో గాయపడ్డారు. పట్టణంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తున్న విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి కుక్కను పట్టుకునేందుకు మున్సిపల్ సిబ్బందిని పురమాయించారు. ఎట్టకేలకు అబ్బరాతివీధిలో మున్సిపల్ సిబ్బంది పిచ్చికుక్కను పట్టుకుని అంతమొందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను మున్సిపల్ కమిషనర్ పరామర్శించారు.

గుంటూరు కొట్టాలులో చోరీ



చోరీ జరిగిన ఇంటిలోని బీరువా

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని గుంటూరు కొట్టాలు గ్రామంలో నాగిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అనే వ్యక్తి ఇంట్లో దుండగులు చోరీ చేశారు. ఆదివారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో జరిగినట్టుగా భావిస్తున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి వసారాలో నిద్రిస్తున్నారు. ఇంటి వెనుక వైపున గోడకు కన్నం వేసిన దుండగులు ఇంటిలోకి ప్రవేశించి బీరువా పగలగొట్టారు. అందులోని 15 తులాల బంగారు ఆభరణాలు, 5 తులాల వెండి వస్తువులు, రూ.25 లక్షల నగదును దోచుకెళ్లారు. ఉదయం లేచి ఇంటిలోకి వెళ్లిన వెంకటసుబ్బారెడ్డి బీరువాలోని వస్తువులు, దుస్తులు చిందరవందరగా ఉండటంతో చోరీ జరిగినట్టు గుర్తించారు. సంఘటనపై మైదుకూరు అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ బాధితుని ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు ఇంటిలో వేలిముద్రలను సేకరించారు. అర్బన్ ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రా కువైట్‌లో ఏపీఎన్ఆర్టీఎస్ ఎత్తివేత!

- జగన్న పాలనలో గల్ఫ్ బాధితులకు భరోసా
- ఏపీఎన్ఆర్టీఎస్‌తో ఎందరికో ఆపన్నహస్తం
- కూటమి పాలనలో సేవలకు మంగళం



రాజంపేట బోయనపల్లెలో ఖాళీ చేసిన ఏపీఎన్ఆర్టీఎస్ కార్యాలయం భవనమిదే..

రాజంపేట : ఉమ్మడి కడప జిల్లాలో ఆంధ్రా కువైట్‌గా ప్రసిద్ధికెక్కిన రాజంపేటలో ఏపీఎన్ఆర్టీఎస్ (ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) కార్యాలయం ఎత్తివేశారు. దీంతో గల్ఫ్ వాసులను ఆదుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. కువైట్ దేశం వలన రాజంపేటలోని ఎస్‌బీఐ రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. ఎన్ఆర్ఐ ఖాతాలను బట్టి రాజంపేట ఆంధ్రా కువైట్‌గా పేరు గడించింది. ఈ నేపథ్యంలో రాజంపేటను గుర్తించి, గల్ఫ్ దేశాలలో ఉండే వారి కోసం ప్రవాసాంధ్రులకు సేవలందించేందుకు గాను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తొలినాళ్లలో న్యూ బోయనపల్లె(కడప-రేణిగుంట జాతీయరహదారి)లో ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయాన్ని కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఖాళీ చేశారు.

రాయలసీమ జిల్లాల కోసం రాజంపేటలో ఏర్పాటు..

రాయలసీమ జిల్లాలలోని గల్ఫ్‌వాసుల కోసం రాజంపేటలోనే ఏపీఎన్ఆర్టీఎస్ ఏర్పాటు చేయడం గమనార్హం. ఇప్పుడు భవన యజమాని టూ లెట్ బోర్డు పెట్టేశారు. దీంతో ఏపీఎన్ఆర్టీఎస్ కార్యాలయం ఎత్తివేసినట్లుగా గల్ఫ్‌వాసులు గుర్తించారు.

ఉమ్మడి జిల్లా నుంచి ఎడారి దేశాలకు..

రాయలసీమలో ప్రధానంగా ఉమ్మడి కడప జిల్లా నుంచి అధికంగా ఎడారి దేశాలకు వెళ్లేవారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. జీవనోపాధి కోసం నాలుగు దశాబ్దాలుగా ఎడారి దేశాలకు రాకపోకలు సాగిస్తూనే ఉన్నారు. ప్రధానంగా కువైట్, ఖత్తర్, దుబాయ్, సౌదీ అరేబియా, బహ్రెయిన్, అబుదాబి, లెబనాన్, మస్కట్ దేశాలు ఉన్నాయి. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు అధికంగా 60 శాతం చదువురాని వారు ఉన్నారు.

మోసాలపాలైన వారి కోసం..

మోసానికి గురై జైలుపాలై అనేక సమస్యలలో ఇరుక్కున్నవారు కూడా ఉమ్మడి కడప జిల్లాలో ఉన్నారు. వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీఎన్ఆర్టీఎస్‌ను బలోపేతం చేశారు. సీమలో గల్ఫ్‌వాసులు అధికంగా ఉన్న కారణంగా రాజంపేటలో సొసైటీ కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా వందలాది మంది గల్ఫ్ బాధితుల సమస్యలకు పరిష్కారం చూపారు. గల్ఫ్‌దేశాలలో జీవించేందుకు, వారిలో నైపుణ్యం పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. విదేశాలకు వెళ్లే వారు, నివసిస్తున్న వారి కోసం హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. సురక్షిత వలసలపై వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలలో అవగాహన కార్యక్రమాలను సొసైటీ నిర్వహించింది. సొసైటీ ద్వారా దేశ వ్యాప్తంగా 200 కంటే ఎక్కువ మందిని కో-ఆర్డినేటర్లను నియమించారు.

ఏపీఎన్ఆర్టీఎస్ ఏమేమి చేసిందంటే..

ప్రవాసాంధ్రులకు సహాయనిధి, భరోసా బీమా, ఆన్‌లైన్ ఐటీ శిక్షణ, ఏపీ పోలీసు ఎన్ఆర్ఐ సెల్, ప్రీ-డిపార్టుమెంట్ ఓరియంటేషన్ అండ్ ట్రైనింగ్, ఏపీఎన్ఆర్టీఎస్ ట్రస్ట్ కనెక్టు టు ఆంధ్రా, పెట్టుబడులు సలహాలు, పవిత్ర నాణేలు, ఆర్థిక పునర్ వ్యవస్థీకరణ కేంద్రం, పాస్‌పోర్టులో సలహాలు, మరణించిన ఎన్ఆర్టీఎస్ బంధువులకు ఎక్స్‌గ్రేషియా, అధునాతన ఐటీ కోర్సులలో ఆన్‌లైన్ శిక్షణ , అంతర్జాతీయ నైపుణ్య శిక్షణ, అంతర్జాతీయ కంపెనీలలో నియామకాల సౌకర్యం వంటి ఉచిత సేవలను అందజేశారు.

జగనన్న పాలనలో ఏపీఎన్ఆర్టీఎస్ బలోపేతం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగిన పాలనలో ఏపీఎన్ఆర్టీఎస్ బలోపేతం చేశారు. అప్పటి వరకు ఇలాంటి సొసైటీ ఒకటి ఉందనేది చాలా వరకు తెలియదు. వైఎస్సార్‌సీపీ పాలనలో సొసైటీ ద్వారా ఎందరో గల్ఫ్ బాధితులను ఆదుకున్నారు. కోవిడ్-19లో తనదైన రీతిలో సేవలందించారు. రాయలసీమలో గల్ఫ్ వాసుల కుటుంబాలు అధికంగా ఉన్నాయి. ఆ దృష్ట్యా రాజంపేటలో సొసైటీ ఏర్పాటు చేశారు.

-గోవిందు నాగరాజు, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కో-కన్వీనర్, కువైట్

ఏపీఎన్ఆర్టీఎస్‌తో విదేశాలలో ఉన్నవారికి భరోసా



ఏపీఎన్ఆర్టీఎస్ ద్వారా విదేశాలలో ఉన్నవారికి భరోసా కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఈ సొసైటీ ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఆ దిశగా అనేక మంది విదేశీ బాధితులను ఆదుకునేందుకు సొసైటీ ముందుకు నడిచేలా జగనన్న ప్రభుత్వం ఏపీఎన్ఆర్టీఎస్‌ను తీర్చిదిద్దింది.

చిల్లా కిరణ్, యూఎస్ఏ, వెంకటరెడ్డిపల్లె, రైల్వేకోడూరు

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మృతి



పెంచలమ్మ(ఫైల్)

బద్వేలు అర్బన్ : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యుల నిర్లక్ష్యంతో తన భార్య ప్రాణాలు కోల్పోయినట్లు బద్వేలు మండలం గుండంరాజుపల్లి ఎస్టీ కాలనీకి చెందిన శ్రీనివాసులు ఆరోపించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తన భార్య అయిన పామూరి పెంచలమ్మ మూడవ కాన్పులో ఆదివారం తెల్లవారుజామున ఇంటి దగ్గరే బిడ్డకు జన్మనిచ్చింది. అయితే అధికంగా రక్తస్రావం అవుతుండడంతో తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ ఏఎన్ఎంను సంప్రదించగా ఆసుపత్రి వద్దకు తీసుకువెళ్లాలని సూచించడంతో ఆటోలో పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ డ్యూటీలో ఉన్న నర్సు డాక్టర్‌కు ఫోన్ చేసి డాక్టర్ సూచనలతో ట్రీట్మెంట్ ఇచ్చినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే రక్తస్రావం ఆగకపోవడంతో వేరే ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో హుటాహుటిన పట్టణంలోని మరొక ఆసుపత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందింది. తన భార్య పరిస్థితి విషమంగా ఉన్నా డాక్టర్ రాకపోవడం పట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సిబ్బంది మాత్రం డాక్టర్ వచ్చేలోపే వారు వెళ్లిపోయారని చెబుతున్నారు.

వేమన పద్యం ప్రాంతాలకు, భాషలకు అతీతమైంది

తెలుగు భాషా సేవకులు స.వెం.రమేశ్



కడప ఎడ్యుకేషన్ : వేమన నిజమైన ప్రజాకవి అని, అందువల్లనే ఆయన పద్యం కులాలను దాటి, మతాలను దాటి, ప్రాంతాలను దాటి, భాషలను దాటి విస్తరించిందని తెలుగు భాషా సేవకులు స.వెం.రమేశ్ అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని కడప సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 144వ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'సజీవ సంప్రదాయంగా వేమన' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. వేమన పద్యం ఏ భాషకూ లేనంత గొప్పతనాన్ని తెలుగు భాషకు కలిగించిందన్నారు. తమిళకవి తిరువళ్ళువర్‌తోనూ, కన్నడకవి సర్వజ్ఞునితోనూ వేమనను పోలుస్తుంటారని, సమాజంలో మంచిని పెంచి, చెడును తుంచే విషయంలో ఆ ముగ్గురికీ పోలిక ఉన్నమాట వాస్తవమే అయినప్పటికీ వీళ్లకన్నా వేమనే గొప్పవాడని అన్నారు. తెలుగువాళ్లు బతుకు పోరాటంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినప్పుడు వాళ్ల నోళ్లల్లో నానుతున్న వేమన పద్యాలు కూడా వాళ్లతోపాటు వెళ్లిపోయి తరాలు మారినప్పటికీ కాలానుగుణంగా వాళ్ల సంప్రదాయాల్లో కూడా నిలిచిపోయాయన్నారు. తమిళనాడులోని కడలూరు జిల్లాలోని అంబలత్తాడియర్లు అనే ఆశ్రిత కులం వాళ్లు తమిళులైనప్పటికీ ధనుర్మాసంలో ఊరంతా తిరుగుతూ 'వేమనానంద పదిగం' అనే పేరుతో తెలుగులో వేమన పద్యాలను చెప్పడమే కాక, వేమనానందస్వామి తమ కులగురువని చెప్పుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు జి.శివారెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, విజయానందరెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్



బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : సాధారణ బదిలీల్లో భాగంగా ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఉమ్మడి కడప జిల్లాలో వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా పోలీసులకు బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టామని జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌కు మొత్తం 646 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహిళా పోలీసులతో మాట్లాడారు. దివ్యాంగులు, మెడికల్, స్పౌజ్, జనరల్, తదితరులను వారి సమస్యల ప్రాతిపదికన పరిగణనలోకి తీసుకుని, వైద్యుల పర్యవేక్షణలో నిజ నిర్ధారణ చేసుకుని పారదర్శకంగా బదిలీలు చేపట్టామని తెలిపారు. అదనపు ఎస్.పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఏ.ఆర్ అదనపు ఎస్.పి. బి.రమణయ్య, స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి ఎన్.సుధాకర్, డి.పి.ఓ ఏ.ఓ జ్యోతి, సూపరింటెండెంట్‌లు, శ్రీనివాస నాయక్, సురేష్, క్లర్కులు ఏ8 అగస్టీన్, ఏ10 గురప్ప, ఐ.టి.కోర్ టీమ్ కానిస్టేబుల్ విశ్వనాథ్, డి.పి.ఓ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

మోసగించిన వ్యక్తి ఇంటివద్ద బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎస్ఐ

కడప అర్బన్ : జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కస్తూర్బా కళాశాలల్లో కేరీర్ కౌన్సెలింగ్ డెవలప్‌మెంట్ అధికారి(సీసీడీఓ) పేరిట ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయంటూ కడపకు చౌటుపల్లె రోడ్డులో నివాసముంటున్న రవి అలియాస్ రఫీ కొంత మంది నిరుద్యోగులను నమ్మ బలికించాడు. ఒక్కో నిరుద్యోగి వద్ద నుంచి రూ.5 లక్షల నుంచి 6.50 లక్షల వరకు వసూలు చేశాడని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా బాధితులు రవి అలియాస్ రఫీ నివసిస్తున్న ఇంటి వద్ద ఆదివారం ఉదయం ఆందోళన చేపట్టారు. బాధితులు మాట్లాడుతూ రవి అలియాస్ రఫీ తమకు ఉద్యోగాలను ఇప్పిస్తామంటూ ఒకొక్కక్కరి దగ్గరి నుంచి రూ. 6:50 లక్షలను తీసుకున్నాడన్నారు. నిరుద్యోగులైన తమకు ఉద్యోగం వస్తే అప్పు ఎలాగైనా తీర్చుకోవచ్చనే ధైర్యంతో తొలుత కొందరు డబ్బులిచ్చి ఉద్యోగాల్లో చేరారన్నారు. సంబంధిత అధికారి సంతకం చేసిన నియామక ఉత్తర్వులను తీసుకుని 2024 ఆగస్టులో ఉద్యోగాల్లో చేరారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లగా అక్కడున్న అధికారులు కూడా తమను ఉద్యోగాల్లో చేర్చుకున్నారని వారు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 21 మంది ఉద్యోగాల్లో చేరామన్నారు. మూడు నెలల పాటు పని చేశామన్నారు. తరువాత ఉన్నతాధికారులు నిర్వహించిన తనిఖీల్లో తమ నియామకాలు చెల్లవంటూ రద్దు చేసి ఇళ్లకు పంపించారన్నారు. తాము డబ్బులిచ్చిన రవి అలియాస్ రఫిని ప్రశ్నించగా తాను కూడా గుంటూరుకు చెందిన వలీ అనే వ్యక్తికి ఇచ్చానని చెప్పాడు. దీంతో బాధితులు జమ్మలమడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు రవి అలియాస్ రఫీపై చీటింగ్ కేసు నమోదు చేశారు. బాధితులు ఏజెంట్ రవి ఇంటి వద్ద ఆందోళన చేస్తుండగా తాలూకా ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఏదైనా ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని జమ్మలమడుగులో రవిపై కేసు నమోదైందని, చట్టపరమైన చర్యలు తీసుకుంటారని ఆందోళన విరమించాలని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు. ఈ విషయంపై ఏజెంట్ రవిని వివరణ కోరగా తనకు రూ.80 లక్షలు డబ్బులు రావాలన్నారు. ఇప్పుడు తనపై ఒత్తిడి తెస్తే, తన వద్ద నుంచి డబ్బులు తీసుకున్న వారు పారిపోతారని తెలిపారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వరపురంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా స్పందించలేదని గ్రామ మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వారు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం స్థానిక మహిళలు మాట్లాడుతూ గత రెండు వారాలుగా తాగునీరు రావడం లేదన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామన్నారు. ఉన్నతాధికారులు తమ సమస్యను పరిష్కరించి తాగునీరు అందించాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పారిజాతం, లక్ష్మీదేవి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు



మాట్లాడుతున్న డాక్టర్ ఇ.సి. దినేష్‌రెడ్డి



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఇ.సి.దినేష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, అరవిందనాథరెడ్డి

- నాన్న గారి ఆశయాలను కొనసాగిస్తాం : డాక్టర్ ఇ.సి. దినేష్‌రెడ్డి
- పాల్గొన్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వైద్యులు, డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి సన్నిహితులు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో గల డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి ఆసుపత్రి(దినేష్ మెడికల్ సెంటర్)లో ఆదివారం నుంచి డయాలసిస్ సేవలు ప్రారంభమయ్యాయి. ఇందుకు సంబంధించిన డయాలసిస్ యూనిట్‌ను డాక్టర్ ఇ.సి. దినేష్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అరవిందనాథరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఇ.సి.దినేష్‌రెడ్డి మాట్లాడుతూ గంగిరెడ్డి ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఉంటే బాగుంటుందని నాన్న (డాక్టర్ ఇ.సి. గంగిరెడ్డి) చెప్పేవారన్నారు. ఆయన కోరిక ప్రకారం ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు ప్రారంభిస్తున్నామన్నారు. నాన్న గారు పులివెందుల నియోజకవర్గంలోని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఆసుపత్రిని అప్పట్లో ఏర్పాటు చేశారన్నారు. పులివెందుల నియోజకవర్గ ప్రజలే కాకుండా పొరుగు జిల్లాల నుంచి ప్రజలు పులివెందులకు వచ్చి వైద్య సేవలు పొందేవారన్నారు. నాన్న గారి ఆశయాలను కొనసాగిస్తూ ఆసుపత్రిలో మరిన్ని వసతులు కల్పించి ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. కార్పొరేట్ ఆసుపత్రిలోని వైద్య ఖర్చులకు మన ఆసుపత్రిలో వైద్య ఖర్చులకు ఎంతో వ్యత్యాసం ఉంటుందని ఆయన తెలిపారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గంగిరెడ్డి బావ ప్రజలకు ఎంతో వైద్య సేవలు అందించి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. గంగిరెడ్డి సార్ వద్దకు వెళితే ఎలాంటి రోగమైనా నయమవుతుందని ఆయన హస్తవాసి చాలా మంచిదని ప్రజలు నమ్మేవారన్నారు. డాక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ ఇ.సి. గంగిరెడ్డి ఆసుపత్రిలో డయాలసిస్ సేవలను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. ఇంతకుమునుపు దూరప్రాంతాలకు వెళ్లేవారని అలా కాకుండా ఇప్పుడు పట్టణంలోనే డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ ఉన్న ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సేవలు అందిస్తున్నప్పటికి పడకలు సరిపడక కర్నూలు, నంద్యాల వంటి దూర ప్రాంతాలకు రోగులు వెళ్లేవారన్నారు. అలా కాకుండా తక్కువ ఖర్చుతో ఇక్కడ డయాలసిస్ వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. డాక్టర్ ఇ.సి.గంగిరెడ్డి ఆసుపత్రిలో అన్ని విభాగాలకు సంబంధించిన నిపుణులైన డాక్టర్లు అందుబాటులో ఉన్నారన్నారు. ఈ ప్రాంత ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందించడంలో ఆసుపత్రిలోని డాక్టర్ల పాత్ర ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వాసు, డాక్టర్ గంగాదేవి, డాక్టర్ పవన్‌కుమార్, డాక్టర్ రవీంద్రనాథరెడ్డి, డాక్టర్ చక్రపాణి, డాక్టర్ సుకన్య, డాక్టర్ జ్యోతి, డాక్టర్ సుప్రజ, డాక్టర్ షబానా, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, డాక్టర్ ఇ.సి. గంగిరెడ్డి సన్నిహితులు సాంబశివారెడ్డి, జయపురెడ్డి, శశికాంత్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, రసూల్, సర్వోత్తమరెడ్డి, హాలు గంగాధరరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, కోడి రమణ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) క్యాజువాలిటీకి ఈనెల 28వ తేదీన రాత్రి 10:40 గంటల సమయంలో గుర్తు తెలియనివ్యక్తిని (29) వైద్యం కోసం తీసుకుని వచ్చారు. అతన్ని పరీక్షించిన వైద్యులు మరణించాడని నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీలో వుంచారు. తగిన ఆధారాలతో వస్తే మృతదేహాన్ని అప్పగిస్తామని రిమ్స్ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు దుర్మరణం

పుల్లంపేట : విధి ఆడిన వింత నాటకంలో తండ్రీ, కూతురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే.. పుల్లంపేట మండలం, దళవాయిపల్లి గ్రామానికి చెందిన బుక్కా వెంకట సుబ్బారెడ్డి (45), కుమార్తె బుక్కా స్నేహలత (18)లు శనివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బుక్కా వెంకట సుబ్బారెడ్డి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. పది రోజుల క్రితం ఇంటికి రావడంతో ఇంటిల్లిపాది ఆనందంగా గడిపారు. హైదరాబాదులో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కుమార్తె స్నేహలత తండ్రి రావడంతో ఇంటికి వచ్చింది. చిట్వేలిలో చదువుతున్న కుమారుడిని పిలుచుకుని వచ్చేందుకు వెంకటసుబ్బారెడ్డి తన కుమార్తె స్నేహలతను తీసుకుని శనివారం బైకుపై బయలుదేరారు. చిట్వేలి నుంచి తిరిగి వస్తుండగా రాజంపేట సమీపంలో అతివేగంగా వచ్చిన స్కార్పియో వాహనం వీరి బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో తండ్రీ కూతురు మరణించారు.

మానవత్వం చాటుకున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రమాదంలో గాయపడిన హనుమంతురెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే ఆదివారం సాయంత్రం పట్టణంలోని స్థానిక జేఎన్టీయూ కాలేజీ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. తొండూరు మండలం క్రిష్ణంగారిపల్లె నుంచి పాల ఆటో పులివెందులకు వస్తుండగా జేఎన్టీయూ సమీపంలోకి రాగానే అక్కడ చెత్త కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా ఆ వ్యక్తిని ఆటో ఢీకొట్టి ఆటో పల్టీ పడింది. ఈ ప్రమాదంలో కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న క్రిష్ణంగారిపల్లెకు చెందిన షబానా, శంషాద్ అనే మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. అదే ఆటోలో ప్రయాణిస్తున్న క్రిష్ణంగారి పల్లెకు చెందిన హనుమంత్ రెడ్డికి నడుము భాగంలో గాయం కావడంతో అతను లేవలేని స్థితిలో రోడ్డుపైనే పడిపోయాడు. ఆ సమయంలో అటువైపుగా పులివెందులకు వస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తన కాన్వాయిని ఆపి కిందికి దిగి గాయాలపాలైన హనుమంత్ రెడ్డిని పరామర్శించి అప్పటికి అక్కడికి 108 వాహనం గాని చేరుకోకపోవడంతో తన సెక్యూరిటీ వాహనం ద్వారా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించాలని అనుచరులకు ఆదేశించారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సెక్యూరిటీ వాహనంలో హుటాహుటిన గాయాలైన హనుమంత్ రెడ్డిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరుకు వెళ్లే రోడ్డులో ఆదివారం సాయంత్రం ఆటో ఢీకొని రోడ్డుపై కాగితాలు ఏరుకునే గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు.. పోలీసులకు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తొండూరు మండలం క్రిష్ణంగారిపల్లె గ్రామానికి చెందిన బాలాజీ పాల డెయిరీ ఆటో పులివెందులకు ప్రయాణికులను ఎక్కించుకుని వస్తుండగా ముద్దనూరు రోడ్డు సమీపంలోని హనుమాన్ గోల్డెన్ సిటీ వద్ద రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి (57) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న షబానా, శంషాద్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో పులివెందుల సర్వజన ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఒక భూమి అమ్మితే మరో భూమి ఆక్రమించారు

న్యాయం కోసం బాధితుడి వేడుకోలు



భూమి పత్రాలను చూపుతున్న ఈశ్వర్‌రెడ్డి

కడప రూరల్ : అధికార పార్టీ నేతల అండతో భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని చింతకొమ్మదిన్నె మండలం, లింగారెడ్డిపల్లెకు చెందిన బి.ఈశ్వర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని బుగ్గలేటిపల్లె గ్రామ పంచాయతీలో చిత్తూరు ప్రధాన రహదారికి ఆనుకొని తనకు మొత్తం 3.70 ఎకరాల భూమి ఉందన్నారు. ఇరవై ఏళ్ల కిందట రోడ్డుకు ఆనుకొని ఉన్న తన మొత్తం భూమిలో వెనుకవైపున ఉన్న 70 సెంట్లను కడప నగరం ఐటీఐ సర్కిల్‌లో నివాసముంటున్న ఒక వ్యక్తికి విక్రయించానని పేర్కొన్నారు. తరువాత తాను ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లానని తెలిపారు. కాగా ఇటీవల నాలుగు నెలల క్రితం తన భూమిని పరిశీలించగా, తన నుంచి 70 సెంట్ల భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి అక్రమంగా రోడ్డుకు ఆనుకొని ఉన్న 50 సెంట్ల స్థలాన్ని ఆక్రమించుకొని ఫినిషింగ్ వేశారని ఆరోపించారు. ఈ విషయమై ఆక్రమించిన వ్యక్తిని ప్రశ్నించగా ఇది తన స్థలం, ఎవరికి చెప్పుకుంటావో.. చెప్పుకోపో నువ్వు వెనక ఉన్న స్థలం తీసుకోపో అని బెదించారన్నారు. సర్వేయర్ వచ్చి కొలతలు వేసి చెప్పినా కూడా ఆక్రమించిన వ్యక్తి వినుకోవడం లేదన్నారు. ఈ విషయమై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని, ఆయన చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్‌కు రెఫర్ చేశారని తెలిపారు. అక్కడికి వెళితే పోలీసులు ఏ మాత్రం స్పందించలేదని వాపోయారు. రెవెన్యూ సిబ్బంది కూడా ఆక్రమించిన వ్యక్తికే వత్తాసు పలుకుతున్నారన్నారు. ఈ విషయమై మరోమారు సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాగమునెమ్మ, ఈశ్వర్‌రెడ్డి, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.